క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా శివానంద్



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దత్తాత్రేయనగర్ కాలనీకి చెందిన చిప్ప శివానంద్ ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొంది వ్యక్తిత్వ వికాస నిపుణుడి సర్టిఫికెట్ అందుకున్నారు. మంగళవారం కామారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఇంపాక్ట్ ప్రతినిధులు లాబిశెట్టి మహేశ్‌కుమార్, నవీన్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. శివానంద్ శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో అకాడమిక్ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాల యజమాన్యం, సిబ్బంది ఆయనను అభినందించారు.

బీటీ రోడ్డు పరిశీలన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు నుంచి బంగల్‌పేట్ వినాయకసాగర్ వరకు నిర్వహించే రెండో దశ బీటీ రోడ్డు పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ పరిసరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దసరా పండుగ ఏర్పాట్లపై చర్చించారు. మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ కొడుకుల గంగాధర్, డీఈ జాదవ్ సంతోష్, రిటైర్డ్ డీఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

వీడీసీ కార్యవర్గం

సర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో మంగళవారం వీడీసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ ఖయ్యూం, ఉపాధ్యక్షుడిగా సురేశ్, కోశాధికారిగా సాయన్న, రైటర్‌గా నాగన్నను ఎన్నుకున్నారు. వీరికి పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఉత్సవాలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో రథోత్సవం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం స్వామివారిని అశ్వ వాహనంపై ఊరేగించగా.. భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ద్రోణ ఉన్నత పాఠశాల విద్యార్థులు వేసిన కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ర్యాలీ అనుమతికి వినతి

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఈనెల 28న శ్రీ వాల్మీకి మహర్షి రథయాత్ర నిర్వహణకు అనుమతి ఇవ్వాలని వాల్మీకి బోయ సంఘం నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో తహసీల్దార్ పరిమల్ బౌమిక్‌తోపాటు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై లింబాద్రిలకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఐబీ చౌరస్తా నుంచి శివాజీనగర్ కాలనీ మహాలక్ష్మి ఆలయం వరకు రథయాత్ర సాగుతుందని పేర్కొన్నారు. ఆకుల నారాయణ, నర్ర చందు, శేఖర్, అడప విలాస్, ఆకుల రమేశ్, కంసాని కృష్ణ, మహేశ్, కుడుదుల రాజేశ్వర్ జనార్దన్ తదితరులున్నారు.

'ముంచేలా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో'

ఖానాపూర్: మరోసారి రాష్ట్రాన్ని నిట్టనిలువునా ముంచేలా కేసీఆర్ బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రకటించారని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు కుక్కరికారి రాజేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేనిఫెస్టోలో కౌలురైతులు, ఉద్యోగుల పీఆర్సీ, పేదలకు ఇల్లు, వైద్యం వంటి కనీస ప్రమాణాలు పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగయ్య, గంగాధర్, గోపాల్, రాజేందర్ తదితరులున్నారు.


మంత్రిని కలిసిన నాయకులు



మంత్రిని సత్కరించిన నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో పట్టణంలోని మంజులాపూర్ వార్డు సభ్యులు మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందించి శాలువాతో సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని.. మరోసారి తనను గెలిపించి పట్టణాభివద్ధికి తోడ్పడాలని కోరారు. మంజులాపూర్ మాజీ సర్పంచ్‌లు అయిన పోశెట్టి, నరేశ్, వార్డుసభ్యులు తదితరులు ఉన్నారు.

బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో విద్యార్థులు

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో మంగళవారం ఘనంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మల వద్ద ఆడిపాడి నిమజ్జనానికి తరలించారు. ప్రిన్సిపాళ్లు సాయిలు, శ్రీనివాస్, డైరెక్టర్లు జానకీరాం, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న విద్యుత్ సమస్యలు

- రాజూరలో సాగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న నాలుగు గ్రామాల ప్రజలు



రాజూరలో జరుగుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో రూ.1.40 కోట్లతో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. దీంతో తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు తీరుతాయని రాజూర గ్రామస్తులతోపాటు సమీపంలోని ఎడ్దూర్-పాట్‌పల్లి, భాగాపూర్, మన్మద్ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి యాసంగి పంటలకు నీరు అందిస్తామని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

మెరుగుపడనున్న సరఫరా..

ప్రస్తుతం పిప్రి సబ్‌స్టేషన్ నుంచి రాజూరతోపాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో ఎప్పుడు కరెంట్ వచ్చి పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బంది పడేవారు. 25 ఏళ్లుగా ఇదే దుస్థితి. అన్నదాతల వినతి మేరకు 2023 ఏప్రిల్‌లో రాజూరలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించారు. పనులు మందకొడిగా సాగడంతో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చొరవ తీసుకుని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

తీరనున్న కష్టాలు..

ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే రాజూరతోపాటు ఎడ్దూర్-పాట్‌పల్లి, భాగాపూర్, మన్మద్ గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. ప్రస్తుతం లోఓల్టేజీతోపాటు లూజ్ వైర్ల సమస్యలు అధికంగా ఉన్నాయి. సరఫరాలో తరచుగా అంతరాయం ఏర్పడితే మోటార్లు కాలిపోతున్నాయి. నూతన సబ్‌స్టేషన్ వినియోగంలోకి వస్తే అన్నదాతలకు ఈ కష్టాలన్నీ తీరనున్నాయి.

కష్టాలు తీరుతాయి



గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్య ఉంది. కరెంట్ ఎప్పుడు వచ్చి పోతుందో తెలియని పరిస్థితి. సబ్‌స్టేషన్ పనులు పూర్తయితే కరెంటు సరఫరాకు ఇబ్బంది ఉండదు. పంటలకు నీరందించేందుకు రైతుల కష్టాలు తీరుతాయి.
– నారాయణ్, రాజూర

మోటార్లు కాలుతున్నాయి



ప్రస్తుతం లోఓల్టేజీ, లూజ్ వైర్ల కారణంగా మోటార్లు కాలుతున్నాయి. యాసంగి పంటలకు విద్యుత్ అందించేలా రాజూర విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేయాలి. అంతరాయంగా విద్యుత్ సరఫరా అయితే పంటలు ఎక్కువగా సాగవుతాయి.
– ఒరికే భోజన్న, రాజూర

త్వరగా పూర్తి చేయిస్తాం



ఉన్నతాధికారులతో చర్చించి రాజూర విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయిస్తాం. ఈ పనులు పూర్తయితే లోవోల్టేజీ సమస్య ఉండదు. యాసంగి పంటలకు విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– ఆర్‌జే చౌహాన్, ఎస్‌ఈ నిర్మల్

దుర్గమ్మా.. చల్లగ చూడమ్మా



కుంటాలలో హారతులిస్తున్న మహిళలు



లోకేశ్వరం: ధర్మోరలో మండపం వద్ద మంగళహారతులతో మహిళలు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించి మంగళహారతులతో అమ్మవారిని వేడుకున్నారు. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.

మస్కాపూర్‌లో మహాచండీ యాగం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో దుర్గాదేవి మండపం వద్ద భక్తులు మహాచండీ యాగం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం అన్నదానం, శనివారం సదరు బోనాల పండుగ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. రాజూరలో దుర్గాదేవి మండపం వద్ద మహిళలు పూజలు చేశారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర, పుస్పూర్, లోకేశ్వరం గ్రామాల్లో మంగళవారం దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. నవరాత్రల సందర్భంగా మహిళలు ఉపవాసం ఉండి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం స్వాములు అభిషేకం చేయించారు. లోకేశ్వరంలో దుర్గాదేవి మండపం వద్ద నాంపల్లి రాము సేట్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

సర్సాపూర్(జి): దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని బోయవాడ హనుమాన్ మందిరం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవికి పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి గంగనీళ్లతో గ్రామ దేవతలకు అభిషేకం చేశారు.

లక్ష్మణచాంద: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు అన్నపూర్ణదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకాపూర్, పీచర గ్రామాల్లో అన్నదానం చేశారు.

మల్లాపూర్‌లో అన్నదానం

లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు మంగళవారం మంత్రి ఐకేరెడ్డి కోడలు దివ్యారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఐకేఆర్ ఫౌండేషన్ ట్రస్టు గౌతం రెడ్డి-దివ్యారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి భోజనం చేశారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కేశం రమేశ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఖానాపూర్: చండీయాగం నిర్వహిస్తున్న భక్తులు



సర్సాపూర్(జి)లో నెత్తిన బోనాలతో మహిళలు



లక్ష్మణచాంద: మల్లాపూర్‌లో దివ్యారెడ్డి పూజలు

మండలం కోసం కొనసాగుతున్న దీక్ష



పల్సిలో నిరాహారదీక్ష చేస్తున్న గ్రామస్తులు

కుభీర్: పల్సిని మండలం చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం ఆరో రోజుకు చేరింది. ఆరో రోజు గ్రామంలో దళిత సంఘాల సభ్యులు దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా పరంగా పెద్ద గ్రామమని, చుట్టూ సిర్పెల్లి, గోడాపూర్, సొనారి, హంపోలి, కస్రా, పార్డి(కె) గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. 40 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని పేర్కొన్నారు. అన్ని విధాల అర్హత ఉన్న పల్సిని మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు.

'వడ్డెరలను మోసం చేస్తున్న ప్రభుత్వం'

ఖానాపూర్: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాత ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడలో మాట్లాడారు. ఎస్టీ జాబితాలో చేర్చుతామని మేనిఫెస్టోలో చేర్చిన రాజకీయ పార్టీలకే మద్దతిస్తామన్నారు. పీటర్, అల్లెపు వెంకటేశ్, ఎల్లయ్య, చిన్నయ్య, రమేశ్, గంగారాం తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తానూరు: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభించేందుకు బుధవారం ఎమ్మెల్యే విఠల్ రెడ్డి రానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలు రావాలని కోరారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



మాట్లాడుతున్న ఎంపీపీ కిషన్

భైంసా: ముధోల్ మండలంలో మంగళవారం బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటారని ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్ అన్నారు.

దస్తురాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ గెలుపునకు కృషి చేయాలని ఎంపీపీ సింగరి కిషన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్యయాదవ్, రాజనర్సయ్య రమేశ్‌రావ్ ఉన్నారు.

'బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి'



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

లోకేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల్లో ముధోల్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని బీజేవైఎం స్టేట్ స్టడీ సర్కిల్ కన్వీనర్ వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో బీజేవైఎం కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ గెలుపే లక్ష్యంగా యువత ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గజేందర్, సాయికిరణ్, అనిల్ తదితరులు ఉన్నారు.

'అనర్హులను తొలగించాలి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడెం: మండలంలోని ఎలగడప గ్రామంలో అనర్హులను గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేశారని.. వెంటనే వారిని జాబితాలోంచి తొలగించాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంసీపీఐయూ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని తన కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అర్హులకే పథకం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్, మండల కార్యదర్శి షేక్ అహ్మద్, సురేందర్, నజీయాబేగం, రాజవ్వ, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

మళ్లీ ఆశీర్వదించండి .. అభివృద్ధి చేస్తా

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- పుస్పూర్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభం



పుస్పూర్ సర్పంచ్ నర్సన్నకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పుస్పూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా ప్రధాన వీధుల్లో ప్రచారరథంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని మహాలక్ష్మి, ముత్యాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అంబేద్కర్, అన్నభావు సాఠే, భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచగుడి, సేవాలాల్ తండా గ్రామాల కార్యకర్తలు, పుస్పూర్ సర్పంచ్ సంగెం నర్సన్నతోపాటు రజక, మున్నూరుకాపు, దళిత సంఘాల సభ్యులతోపాటు వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు భుజంగ్‌రావు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, నాయకులు గన్ను సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ముత్యంరెడ్డి, బండి ప్రశాంత్, లక్ష్మణ్ పటేల్, ఇబ్రహీం, సుధాకర్, రాంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, లోకేశ్‌రెడ్డి తదితరులున్నారు.

లోకేశ్వరంలో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించారు. బీజేపీ సీనియర్ నాయకుడు షిబ్బుల హరీశ్ తోపాటు పిప్రి, నగర్, బామ్నికే, లోకేశ్వరం, రాజూర గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే నెల 3న భైంసా పట్టణంలో నిర్వహించే సభకు ముఖ్య అతిథిగా సీఎం కేసీఆర్ వస్తున్నారని.. కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కపిల్, భోజన్న, నర్సింగ్‌రావు, ప్రశాంత్, దత్తురాం పటేల్, నవీన్, రసూల్ ఉన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సోన్ సీఐ నవీన్‌కుమార్



బొజ్జు వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

సోన్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సోన్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని న్యూవెల్మల్‌బొప్పారం గ్రామంలో మంగళవారం ఎస్సై సంతోషం రవీందర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బెల్టుషాపులు, మట్కా, గంజాయి, పేకాట ఆడినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వివరించారు. అనంతరం అనుమానాస్పద గృహాలు, బెల్టుషాపులను, వాహనాలను తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో మామడ, లక్ష్మణచాంద ఎస్సైలు రాజు, శ్రీకాంత్, స్పెషల్ పోలీసులతోపాటు ఇరు గ్రామాల వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయకుల వాహనాలు తనిఖీ

దస్తురాబాద్: మండల కేంద్రం సమీపంలో మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ వాహనంతోపాటు బీజేపీ నాయకులు రితీశ్ రాథోడ్ వాహనాలను స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి నగదు పట్టుబడలేదని ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రత్యేకాధికారి చంద్రమౌళి, చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది రాంచందర్, రాజేశ్వర్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లేశ్

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మోహిద్ అధ్యక్షతన నిర్వహించిన ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు ఎంపీడీవో బాలే మల్లేశ్ మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశాన్ని గంటలోనే ముగించేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ వాల్‌సింగ్, పలువురు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బకాయిల విడుదలలో తాత్సారం..!

- విద్యావలంటీర్లకు అందని గౌరవవేతనం
- పండుగపూటైనా ఇవ్వాలని వేడుకోలు



భైంసాటౌన్: 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది' జిల్లాలోని విద్యావలంటీర్ల పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలల్లో 2019–20 విద్యా సంవత్సరంలో పని చేసిన వీవీ(విద్యావలంటీర్ల)కు సంబంధించిన గౌరవ వేతన బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాకు రూ.26.73 లక్షలు మంజూరు కాగా వీవీల ఖాతాల్లో జమ చేయాలని గతనెల ఒకటో తేదీన ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ ఇప్పటివరకు వారి ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో పండుగ పూట వారు బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు.

రూ.26.73 లక్షలు విడుదల..

జిల్లాలోని సర్కారు బడుల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ స్థానాల్లో ప్రభుత్వం 2018–19 విద్యా సంవత్సరంలో విద్యావలంటీర్లను నియమించింది. 2019–20 విద్యాసంవత్సరంలో కూడా వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంది. కరోనా సమయంలో పాఠశాలలు మూతపడిన విషయం తెలిసిందే. దీంతో తర్వాతి విద్యాసంవత్సరం నుంచి వారిని విధుల్లోకి తీసుకోలేదు. 2019–20 విద్యాసంవత్సరానికి సంబంధించిన బకాయిలు రావాల్సి ఉంది. ఎట్టకేలకు ప్రభుత్వం జిల్లాలో 346 విద్యా వలంటీర్లకు రూ.26.70 లక్షల నిధులు విడుదల చేసింది. వెంటనే వీవీల ఖాతాల్లో జమ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నెలరోజులు గడుస్తున్నా ఇప్పటికీ జమ చేయలేదు.

బకాయిలు జమ చేయాలి..



నేను భైంసాలోని ఏపీనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యావలంటీర్‌గా పనిచేశాను. 2019–20 విద్యాసంవత్సర బకాయిలు ప్రభుత్వం విడుదల చేసింది. అధికారులు ఖాతాల్లో జమ చేయాలి.
– వీరేశ్, విద్యావలంటీర్, భైంసా

బిల్లులు పంపించాం..

విద్యా వలంటీర్లకు గౌరవ వేతన బకాయిలు రూ.26.73 లక్షలు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా ట్రెజరీ కార్యాలయానికి బిల్లులు పంపించాం. ఈ కుబేర్ ద్వారా త్వరలో వారి ఖాతాల్లో జమవుతాయి.
– రవీందర్, డీఈవో

పరామర్శ

కుభీర్: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బిచ్చేవార్ రాధాబాయి, వడ్ల లక్ష్మీబాయి కుటుంబాలను మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామారావ్ పటేల్ పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకొని సానుభూతి వ్యక్తం చేశారు. వారి వెంట ప్యాట లక్ష్మణ్, ఉప్పు దత్తాత్రి, జావెద్‌ఖాన్, నాగేందర్ తదితరులు ఉన్నారు.